మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే... 5 PM
గురువారం , ఆగస్టు 27, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## తెలంగాణ విద్యార్థులకు గుడ్‌న్యూస్.. ప్రభుత్వ పాఠశాలలు,

# కాలేజీల్లో పౌష్టికాహారం




**హైదరాబాద్ :** ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల విద్యార్థుల కు ప్రతిరోజూ పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేసి ంది. మంచిర్యాల జిల్లా పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూఫ్ టాప్ ఆటోమేటెడ్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేశారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులు, హరేకృష్ణ ఫౌండేషన్ సహకారంతో 42 వేల మంది విద్యార్థులకు ఒకే సమయం లో అల్పాహారం, 5 వేల మంది కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న పిల్లలు అర్థాకలితో ఉండకూడదన్న నిర్ణయంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అల్పాహార పథకం మంచిర్యాల జిల్లా లో ఆగస్టు 31వ తేదీన ప్రారంభం కానుంది. ఈ కిచెన్‌కు హరేకృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఆధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించనున్నారు. ఈ కిచెన్ ద్వారా 18 మండలాల్లోని 691 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 42,450 మంది విద్యార్థులకు, అలాగే 13 జూనియర్ కాలేజీల్లో చదువుతున్న 6,654 మంది విద్యార్థులకు ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్ అందిం చనున్నారు. విద్యార్థులు ఉదయం పూట అర్థాకలితో పాఠశాలకు వెళ్లకుండా, ఆరోగ్యకరమైన అల్పాహారం తో ఉత్సాహంగా విద్యను అభ్యసించేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుందని చెపుతున్నారు నిర్వహకులు. ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా గంటకు 8 వేల ఇడ్లీలు, 3 వేల దోశలు, 5 వేలకు పైగా పూరీలు తయారు చేసే సామర్థ్యంతో ఈ కిచెన్ ఏర్పాటు చేశామని హరేకృష్ణ మూమెంట్ నిర్వహకులు చెపుతున్నారు. రెండు గంటల్లో 5 వేల మంది విద్యార్థులకు సరిపడా సాంబారు, కూరలను తయారు చేస్తామని తెలిపారు.



- కడియం శ్రీహరిపై వ్యాఖ్యల నేపథ్యంలో కౌశిక్ రెడ్డికి నోటీసులు
- కౌశిక్ రెడ్డిని రాజకీయంగా బలి చేసేందుకు కుట్ర జరుగుతోందన్న వేముల ప్రశాంత్ రెడ్డి
- సీఎం, కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు ఎథిక్స్ కమిటీ పరిధిలోకి రావాలని ప్రశ్న

## పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు..

# బీఆర్ఎస్ ఫైర్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ శాసనసభ ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వచ్చిన ఫిర్యాదును విచారించేందుకు ఈ నెల 29న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్-1లో ఎథిక్స్ కమిటీ సమావేశం కానుంది. అయితే, ఈ నోటీసులపై బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఎథిక్స్ కమిటీ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని... కౌశిక్ రెడ్డిని రాజకీయంగా బలిచేసేందుకే ఈ కుట్రలు పన్నుతోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు దానం నాగేందర్, మందుల సామేల్, వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో మాట్లాడిన తీవ్రమైన పదజాలం, అసభ్య సైగల వీడియోలను ఈ సందర్భంగా వేముల ప్రదర్శించారు. సభలో సీఎం, అధికార పక్ష నాయకులు చేసిన బెదిరింపులు, వ్యాఖ్యలు ఎథిక్స్ కమిటీ పరిధిలోకి రావా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. అంతేకాకుండా, కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని స్పీకర్ సిఫార్సు చేసిన సమయంలో అసలు ఎథిక్స్ కమిటీయే మనుగడలో లేదని, అలాంటప్పుడు ఆ అంశాన్ని కమిటీకి ఎలా రెఫర్ చేస్తారని వేముల నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధి పొంది ఇప్పుడు అదే పార్టీపై విమర్శలు చేస్తున్న కడియం శ్రీహరి వైఖరిని మాత్రమే కౌశిక్ రెడ్డి ఆక్షేపించారని, దీనిపై కక్షపూరితంగా వ్యవహరించడం కాంగ్రెస్ మార్క్ రాజకీయాలకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు.

## రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, వార్డు సభలు

# 36,353 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



**హైదరాబాద్:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు జరగనున్నాయి. వివిధ కారణాలతో ఇప్పటికే తొలగించిన ఓటర్లలో అర్హులుంటే గుర్తించనున్నారు. కొత్త ఓటర్ల నమోదు, అడ్రస్, ఇతర వివరాల మార్పుపై అవగాహన కల్పించనున్నారు. ఎస్ఐఆర్‌లో భాగంగా అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేసి వివరణలు నమోదు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జనరేట్ చేసి పంపిణీ చేస్తున్నారు. బోగస్ ఓటర్లపై అభ్యంతరాల స్వీకరణ : ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల్లో గ్రామసభలు అలాగే పట్టణాలు, నగరాల్లో వార్డు సభలు జరగనున్నాయి. రాష్ట్రంలోని 36,353 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామ, వార్డు సభల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్‌వోలపై సీఈవో సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మార్గదర్శకాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 3.38 కోట్ల ఓటర్లు ఉండగా ఇటీవల ఎన్యుమరేషన్ ప్రక్రియ తర్వాత 73.39 లక్షల ఓట్లు తొలగించారు. మరణించిన, చిరునామా మార్చిన డూప్లికేట్, అందుబాటులో లేని ఓటర్లను తొలగించినట్లు సీఈవో కార్యాలయం ప్రకటించింది. అలా తొలగించిన ఓటర్ల పేర్లను గ్రామసభల్లో చదివి వినిపిస్తారు. తొలగించిన ఓటర్లలో అర్హులుంటే గుర్తించి తిరిగి చేర్చే ప్రక్రియ చేపడతారు.

## చిలకలూరిపేట వద్ద

# ఘోర ప్రమాదం

### ఏడుగురి మృతిపై సీఎం దిగ్భ్రాంతి

- పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు.. ఏడుగురు అక్కడికక్కడే మృతి
- మృతులంతా వేలూరు గ్రామానికి చెందిన వారిగా గుర్తింపు



**పల్నాడు జిల్లా :** చిలకలూరిపేట సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విజయవాడ నుంచి తిరుపతికి వెళ్తున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, చిలకలూరిపేట వద్ద ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారని అధికారులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు స్పందించారు. గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## విజయ్‌లా మన హీరోలు

# గెలవలేరు




**హైదరాబాద్:** తమిళనాడులో నటుడు విజయ్ సాధించిన అఖండ రాజకీయ విజయం, తెలుగు రాష్ట్రాల్లోని సినీ హీరోలకు సాధ్యం కాదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ (జేపీ) అభిప్రాయపడ్డారు. ప్రజలు అవినీతి అంతం కావాలని కోరుకుంటారు కానీ, దానికోసం ఉద్యమించడానికి ముందుకు రారని, ఇదే ఇక్కడి ప్రధాన సమస్య అని ఆయన విశ్లేషించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ ఊహించని రీతిలో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జేపీ మాట్లాడుతూ "తమిళనాడులో విజయ్ తరహాలో ఇక్కడి సినీ హీరోలకు సాధ్యం కాదు. అవినీతి అంతమవ్వాలని కోరుకుంటారు. ఉద్యమించడానికి మాత్రం ఎవరూ ముందుకు రారు. జెన్ జీ ఉద్యమించినా 10-15 ఏళ్ల తర్వాతే ఫలితాలు వస్తాయి" అని స్పష్టం చేశారు. రజినీకాంత్, కమల హాసన్ వంటి అగ్ర నటులకు కూడా దక్కని విజయాన్ని విజయ్ సాధించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత తరం, ముఖ్యంగా యువత (జెన్-జీ) 'ఒకే ఒక్కడు' సినిమాలో మాదిరిగా తక్షణ అద్భుతాలు జరగాలని ఆశిస్తున్నారని, ఇది ప్రమాదకరమైన ఆలోచనా విధానమని జేపీ హెచ్చరించారు.

## నేపాల్‌కు భారత్ ఆపన్నహస్తం

# 10టన్నుల మానవతా సాయం అందజేత


- భారీ అకస్మిక వరదలతో అతలాకుతలమైన నేపాల్
- పొరుగు దేశానికి 10 టన్నుల మానవతా సాయాన్ని అందజేసిన భారత్
- వరదల్లో గల్లంతైన భారతీయులను రక్షించేందుకు నేపాల్ ప్రభుత్వంతో కలిసి కృషి చేస్తున్నామన్న కేంద్రం సర్కార్



**న్యూఢిల్లీ:** నేపాల్‌లోని భోటెకోషి నదీ ప్రాంతంలో సంభవించిన భారీ ఆకస్మిక వరదలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గల్లంతైన భారతీయ పౌరులను గుర్తించి రక్షించేందుకు నేపాల్ ప్రభుత్వంతో కలిసి భారత్ సమన్వయం చేసుకుంటోందని తెలిపింది. వరద ప్రభావిత ప్రాంతాలకు సహాయం ఇప్పటికే చేరడం ప్రారంభమైందని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు. మరోవైపు, వరదలతో అతలాకుతలమైన నేపాల్‌కు భారత్ ఆపన్నహస్తం అందించింది. 10 టన్నుల మానవతా సహాయాన్ని నేపాల్‌కు అందజేసింది. "నేపాల్‌లో అకస్మాత్తుగా వరదలు వచ్చినట్లు మాకు సమాచారం అందింది. ఈ వరదల వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో సుమారు 133 మంది భారతీయులు ఉన్నారు. వీరి ఆచూకీ ఇంకా లభించలేదు. భారత జాతీయ సహాయక బృందాలు క్షేత్రస్థాయిలో ఉండి అన్వేషణ, రక్షణ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాయి. వరదల్లో గల్లంతైన వీలైనంత ఎక్కువ మందిని గుర్తించి, సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి కృషి చేస్తున్నాయి. గల్లంతైన వారిని రక్షించడానికి నేపాల్ ప్రభుత్వ సహకారంతో అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం."- కీర్తి వర్ధన్ సింగ్, కేంద్ర సహాయ మంత్రి 'నేపాల్‌కు అవసరమైన సాయం చేస్తాం' నేపాల్ పట్ల భారత్ చూపిన చురుకైన దౌత్యం, మానవతావాద స్పందనను కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాలకు సాయం ఇప్పటికే చేరడం ప్రారంభమైందన్నారు. నేపాల్‌లో ఇలాంటి విపత్తులు ఏర్పడినప్పుడల్లా భారత్ చొరవ తీసుకుని సాయం చేసేందుకు ముందుకొచ్చిందని గుర్తు చేశారు. ఎందుకంటే భారత్‌కు నేపాల్ ఒక స్నేహపూర్వక దేశమని పేర్కొన్నారు. ఇరుదేశాల సమాజాల మధ్య పెద్దగా తేడా లేదన్నారు. రెండు దేశాలు ఎల్లప్పుడూ అన్నదమ్ముల అనుబంధంతో కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు.

## భారత అథ్లెట్ల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందా

# 2036 ఒలింపిక్స్‌కు సిద్ధమవ్వాలి:



**న్యూఢిల్లీ :** యువతను పాడుచేస్తున్న డ్రగ్స్ వ్యసనానికి వ్యతిరేకంగా పోరాడ టంలో క్రీడలు ఒక అద్భుతమైన ఆయుధంగా పనిచేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. క్రీడలు జీవితాలను ఎలా మార్చగలవో చెప్పడానికి మన పారా అథ్లెట్లు ఒక ఉదాహరణ అని, వారి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని అన్నారు. క్రీడల పట్ల తన దృక్పథం కేవలం పతకాలు సాధించడం మాత్రమే కాదని, దేశ నిర్మాణ ప్రక్రియలో వాటిని ఒక అంతర్భాగంగా మార్చడమేనని పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా డైలాగ్?లో మోదీ వర్చువల్?గా పాల్గొని మాట్లాడారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది క్రీడాకారులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు. "ఒలింపిక్స్‌లో అనేక రకాల క్రీడలు ఉంటాయి. కానీ భారతీయ జట్లు వాటిలో కనీసం సగం విభాగాల్లో కూడా పాల్గొనడంలేదు.

# వన దుర్గ భవాని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మేకల రాజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక

**మన ప్రజావాణి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27**

మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవనంలో వనదుర్గ భవాని ప్రెస్ క్లబ్ నూతన కమిటీని అధికారికంగా ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మేకల రాజ్ కుమార్ ను వన దుర్గ భవాని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా. నూతన అధ్యక్షులు మేకల రాజ్ కుమార్ మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ కమిటీ తనను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పత్రికా మిత్రులు, మీడియా మిత్రుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సమాజంలో జర్నలిజం పట్ల ఉన్న గౌరవాన్ని మరింత పెంపొందించే విధంగా, ప్రజా సమస్యలను



వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యతాయుతమైన పాత్రికేయ వృత్తికి కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న నూతన కమిటీ సభ్యులతో పాటు పత్రికా, మీడియా మిత్రులందరికీ మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు అధ్యక్షులు మేకల రాజ్ కుమార్ గౌరవాధ్యక్షులు పద్మ బిక్షపతి ఉపాధ్యక్షులు + సాయి గౌడ్ ప్రధాన కార్యదర్శి రాము సహాయ కార్యదర్శులు నరేష్ యాదవ్,కోశాధికారి మహేష్ ముఖ్య సలహాదారులు: కార్యవర్గ సభ్యులు సాయి గౌడ్, సందీప్ గౌడ్,బిక్షపతి, చింతల సిద్దు ఎల్లం సురేష్ పి శ్రీకాంత్ శ్రీనివాస్ గౌడ్ విలేకరులు పాల్గొన్నారు

# ‘తీజ్’కోసం సర్పంచి సోమన్న డప్పులు వితరణ..

**- హర్షం వ్యక్తం చేసిన ‘జామ’తండా గిరిజనులు..**



**ప్రజావాణి,నెల్లికుదురు:** గిరిజన సాంప్రదాయాన్ని ప్రతిబింబించే తీజ్ పండుగలో లంబాడీలు లయబద్ధంగా ఆడి పాడడానికి నెల్లికుదురు మండలం జామ తండ సర్పంచి గుగులోతు సోమన్న ఆ తండా గిరిజనులకు డప్పులు వితరణ చేశారు. డీజే హోరు డప్పుల దరువు ఊపు వచ్చేలా ఉండేందుకు 25 డబ్బులను రూ.25 వేలు వెచ్చించి గిరిజనులకు అందజేశారు. ఎమ్మెల్యే డా.భూక్య మురళి నాయక్ పై గల అభిమానంతో డప్పులపై మురళి నాయక్ పేరును ముద్రించారు. ఈ సందర్భంగా సర్పంచి సోమన్న మాట్లాడుతూ తీజ్ పండుగ లంబాడీలకు అత్యంత పవిత్రమైనదన్నారు. సర్పంచి డప్పులు పంపిణీ చేయడంతో జామ తండా గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. గిరిజన సంప్రదాయ దుస్తులతో బాలబాలికల నుంచి అన్ని వయసుల వారు తీజ్ వేడుకల్లో సందడి చేస్తూ నృత్యాలు చేయడం,పాటలు పాడటం వంటి ప్రదర్శనలతో ప్రత్యేకత సంచరించుకుంటుందన్నారు. బంజారాల సంస్కృతి సాంప్రదాయాలను ప్రోత్సహించేందుకు గిరిజన సోదరుల అభ్యర్థన మేరకు డప్పులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గుగులోత్ సుమన్,వినోద్, సంజీవ్,రాజన్,భూక్య సుమన్,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బిక్షపతి,లక్ష్మణ్,వీరు గ్రామస్తులు రవి,నరేష్,బాల,శంకర్ ధర్మంసోత్ బాలాజీ,గుగులోత్ యాదగిరి, డప్పు గ్రహీతలు,స్థానిక నాయకులు, తండావాసులుపాల్గొన్నారు.

# ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో డిపాజిట్ల కలకలం: సమాచారం ఇవ్వకుండా దాటవేస్తున్న అధికారులు!

**వెంకటాపురం (నూగూరు), ఆగస్టు 27 (ప్రజావాణి)**

: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం (పీఏసీఎస్)లో పొదుపు చేసుకున్న తమ డబ్బుల కోసం సామాన్య ప్రజలు, రైతులు, ముఖ్యంగా వయోవృద్ధులు నిత్యం కార్యాలయం చుట్టూ తిరుగుతూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. తమ కష్టార్జితాన్ని దాచుకున్న బాధితులు డిపాజిట్ల గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా డబ్బులు తిరిగి రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ పొదుపు వివరాలు, రికార్డులకు సంబంధించిన సమాధానాల కోసం ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం) ద్వారా దరఖాస్తు చేసినప్పటికీ, అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వివరాలు కోరితే సరియైన సమాధానం ఇవ్వకపోవడం, మూల నమోదు పుస్తకాలు మరియు చెల్లింపుల సమాచారాన్ని అందించకుండా దాటవేస్తుం



డటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు కూడా తమ సొమ్ము కోసం కార్యాలయం చుట్టూ తిరిగి అస్వస్థతకు గురవుతుండటం స్థానికంగా కలచివేస్తోంది. రికార్డుల పట్ల జవాబుదారీతనం వహించాల్సిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం శోచనీయమని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా సహకార శాఖ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, సొసైటీ వ్యవహారాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, వృద్ధులకు మరియు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

# కొండాపూర్ గ్రామపంచాయతీలో ఓటరు జాబితాపై గ్రామ సభ



**దండేపల్లి, ఆగస్టు 27 (సక్రమ ప్రజా పాలన):** దండేపల్లి మండలం కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి ఇప్ప రవళి--సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో బూత్ స్థాయి అధికారి గంధం భాగ్యమ్మ, గ్రామపంచాయతీ అధికారి వెంకటస్వామి ముసాయిదా ఓటరు జాబితాలోని వివరాలను గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా, పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు అవసరమైనా సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించిన ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మన్నే రవికుమార్, పంచాయతీ కార్యదర్శి దర్శనాల నాగేష్, క్షేత్ర సహాయకుడు కొల్లూరి సతీష్, వార్డు సభ్యుడు మాదాసు సుమన్, ఆశా కార్యకర్త మన్నే సుమలత, కారోబార్ ప్రభాకర్, గ్రామపంచాయతీ సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షం వస్తే రోడ్డంతా చెరువే.. జోగిపేట్‌లో ప్రజల అవస్థలు

**- ప్రభుత్వ ఆసుపత్రి, కోర్టు, మున్సిపల్ కార్యాలయానికి ఇదే ప్రధాన మార్గం**

**మన సమగ్ర ప్రజావాణి 27 (జోగిపేట ) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**

అందోల్--జోగిపేట్ మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారిపై వర్షం పడిన ప్రతిసారి నీరు నిలిచి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోర్టు, ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, ఇంటర్ కాలేజీ, డిగ్రీ కాలేజీతో పాటు ప్రసిద్ధ జోగినాథ్ ఆలయానికి వెళ్లే ప్రధాన మార్గం కావడంతో ఈ రహదారిపై నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.వర్షపు



నీరు రోడ్డుపై పెద్దఎత్తున నిలిచిపోవడంతో వాహనదారులతో పాటు కాలినడకన వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు, వర్షపు నీరు కలిసి రోడ్డుపై నిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీరు నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు రహదారిపై నిలిచిన నీటిని తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.


# వన దుర్గ భవాని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మేకల రాజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక.







**మన ప్రజావాణి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27.**

మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవనంలో వనదుర్గ భవాని ప్రెస్ క్లబ్ నూతన కమిటీని అధికారికంగా ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మేకల రాజ్ కుమార్ ను వన దుర్గ భవాని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా. నూతన అధ్యక్షులు మేకల రాజ్ కుమార్ మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ కమిటీ తనను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పత్రికా మిత్రులు, మీడియా మిత్రుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సమాజంలో జర్నలిజం పట్ల ఉన్న గౌరవాన్ని మరింత పెంపొందించే విధంగా, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యతాయుతమైన పాత్రికేయ వృత్తికి కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న నూతన కమిటీ సభ్యులతో పాటు పత్రికా, మీడియా మిత్రులందరికీ మరోసారి హృదయపూర్వక ధన్యవాదా లు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు అధ్యక్షులు మేకల రాజ్ కుమార్ గౌరవాధ్యక్షులు పద్మ బిక్షపతి ఉపాధ్యక్షులు + సాయి గౌడ్ ప్రధాన కార్యదర్శి రాము సహాయ కార్యదర్శులు నరేష్ యాదవ్,కోశాధికారి మహేష్ ముఖ్య సలహాదారులు: కార్యవర్గ సభ్యులు సాయి గౌడ్, సందీప్ గౌడ్,బిక్షపతి, చింతల సిద్దు ఎల్లం సురేష్ పి శ్రీకాంత్ శ్రీనివాస్ గౌడ్ విలేకరులు పాల్గొన్నారు


# ఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలి

**- ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్**

**బెజ్జంకి, ఆగస్టు 27ప్రజావాణి**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల గోడపత్రికలను ఏఐవైఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు బోనగిరి శ్రావణ్‌తో కలిసి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను యువత అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని విమర్శించారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని, చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు కల్పించలేని పక్షంలో నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. రాష్ట్రంలోనూ ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేసి ఖాళీలను భర్తీ చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగం, ఉపాధి, విద్య, ఉద్యోగ అవకాశాలు తదితర యువజన సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. యువజన సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు రాష్ట్ర మహాసభలు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల అధ్యక్షుడు అంతటి రాకేష్, ఉపాధ్యక్షులు రొడ్డ లక్ష్మణ్, శంకర్, మధు, సుమంత్, వడ్లూరి మల్లేశం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలుకు 50 ఏళ్లు

**సికింద్రాబాద్:** రాయలసీమ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు అత్యంత అరుదైన మైలురాయిని చేరుకుంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో విజయవంతంగా 49ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకొని 50వ ఏడాదిలోకి అడుగు పెట్టింది. అర్ధ దశాబ్దం పాటు పేదల బండిగా ఈ రైలుకు పేరుంది. 1977వ సంవత్సరంలో ఈ రైలు ప్రారంభమైంది. అప్పట్లో మీటర్ గేజీ పట్టాలపై సింగిల్ లైన్‌లో సామాన్యులకు అందుబాటులో ఉండేది. కాలక్రమంలో ప్రయాణికుల రద్దీ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ (నాంపల్లి) దక్కన్ నుంచి నిజామాబాద్‌కు పొడిగించారు. ఎక్స్‌ప్రెస్ నుంచి సూపర్ ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్ చేసి ఆధునిక ఇంజన్లతో



ప్రయాణం సాగిస్తోంది. తిరుపతి నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మీదుగా 890 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణాన్ని అనునిత్యం కొనసాగిస్తోంది. తరాలు మారుతున్నా, ఎన్నో కొత్త రైళ్లు అందుబాటులోకి వస్తున్నా ఈ రైలుకున్న ఆదరణ తగ్గలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే మూడు రాష్ట్రాల ప్రజలకు ఆత్మీయ సేవలందిస్తోంది. కాగా, వికారాబాద్ జిల్లా తాండూరు మీదుగా రాకపోకలు సాగిస్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్?తో ఇక్కడి ప్రజలకు ప్రత్యేక అనుబంధం ఉంది.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com